31వ వసంతంలోకి
# చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
శుక్రవారం 10 జులై 2026 పేజీలు : 8

## అంగన్‌వాడీ భవనం ఆక్రమణ తొలగించాలి

**-మాజీ మంత్రి టి.జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల అధికారులకు విజ్ఞప్తి**



**చురకలు విలేకరి, బీర్ పూర్, జూలై 9 :** బీర్‌పూర్ మండలం నరసింహులపల్లె గ్రామంలోని అంగన్‌వాడీ భవనం ఆక్రమణను వెంటనే తొలగించి ప్రభుత్వ ఆస్తిని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి గ్రామస్థులు, పార్టీ నాయకులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని సర్వే నంబర్--22, హౌస్ నంబర్--3-96 ప్రభుత్వ అంగన్‌వాడీ భవనంగా రెవెన్యూ అధికారులు నిర్ధారించారని తెలిపారు. ఎమ్మార్వో నివేదిక ప్రకారం ప్రభుత్వ ఆస్తి ఆక్రమణకు గురైందని ఆరోపించారు. ప్రజావాణిలో గ్రామస్థులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, సంబంధిత -2లో

## ఫలితాల మెరుగుదలకు
# ఎఫ్‌ఎల్‌ఎన్ పై దృష్టి సారించాలి

- ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణితంలో కనీస సామర్థ్యాలు పెంపొందించాలి
- జగిత్యాల కలెక్టర్ బి. సత్యప్రసాద్

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 9 :** విద్యార్థుల ఫలితాల మెరుగుదలకు ఎఫ్‌ఎల్‌ఎన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, గణితంలో కనీస సామర్థ్యాలు పెంపొందించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో గురువారం జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ కార్యక్రమంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థుల ఫలితాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ అమలుపై నిర్వహించిన సమావేశంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పలు కీలక సూచనలు చేశారు. పదో తరగతి చదువుతున్న కొంతమంది విద్యార్థులు కూడా కనీస అభ్యాస సామర్థ్యాలను సాధించలేకపోతున్న పరిస్థితి ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రాథమిక స్థాయి నుంచే ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం, గణితంలోని చతుర్విధ ప్రక్రియలపై సంపూర్ణ పట్టు కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక



కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు మాసవారీ లక్ష్యాలను నిర్దేశించి, ప్రతి నెలా వాటి పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. ఉత్తమ ప్రగతి సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను ప్రతి నెలా అభినందించి ప్రోత్సహిస్తామని, తక్కువ ప్రగతి సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులతో నేరుగా సమావేశమై సమస్యలను గుర్తించి, అభ్యాస ఫలితాలు మెరుగుపడేలా ప్రత్యేక చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో జగిత్యాల జిల్లా పీజీఐలో ద్వితీయ స్థానం సాధించడం గర్వకారణమని, అయితే గత విజయాలతో సంతృప్తి చెందకుండా ఫలితాలను మరింత మెరుగుపరచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి గ్రేడ్కు తగిన చదువు సామర్థ్యాలను సాధించేలా కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. సింగిల్ టీచర్ పాఠశాలలు, మల్టీగ్రేడ్ తరగతులు, తక్కువ హాజరు, బోధనా సామగ్రి వినియోగంలో లోపాలు, రెమెడియల్ టీచింగ్ అవసరం వంటి సవాళ్లను గుర్తించి వాటిని సమిష్టిగా అధిగమించాలని సూచించారు. ప్రతి నెల ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాలు నిర్దేశించుకుని, పాఠ్యపుస్తకాలు, టీచర్ హ్యాండ్ బుక్, విద్యార్థుల వర్క్ బుక్ మధ్య సమన్వయంతో బోధన సాగించాలని తెలిపారు. బేస్‌లైన్, మిడ్‌లైన్, ఎండ్‌లైన్ అంచనాల ద్వారా విద్యార్థుల పురోగతిని నిరంతరం పరిశీలించి, అంచనాల ఫలితాలను కార్యాచరణ ప్రణాళికలుగా మార్చాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక రెమెడియల్ బోధన అందించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని, సాంప్రదాయ బోధనకు బదులుగా భావనాత్మక, సృజనాత్మక, కార్యకలాపాల ఆధారిత, విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి నెల ఉత్తమ ఉపాధ్యాయులు, ఉత్తమ పాఠశాలలు, వినూత్న బోధనా విధానాలను గుర్తించి విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. పాఠశాల సముదాయాలను అకాడమిక్ లెర్నింగ్ కమ్యూనిటీలుగా అభివృద్ధి చేసి, ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, అకాడమిక్ బృందాలు -2లో

## పంచాయతీ సమగ్ర అభివృద్ధికి
# ప్రణాళికలు రూపొందించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- ఇందిరమ్మ గృహాల అర్హుల జాబితాను గెజిటెడ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలి
- ఎంపీడీవోలు సమన్వయంతో పారదర్శకంగా గృహాల ధృవీకరణ పూర్తి చేయాలి





**చురకలు ప్రతినిధి, కమాన్ పూర్ (పెద్దపల్లి), జూలై 09 :** గ్రామాల సమగ్రాభివృద్ధికి గ్రామాల అవసరాలకు అనుగుణంగా గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, -2లో

## విపత్తుల సమయంలో
# ఎస్డీఆర్ఎఫ్ కీలకం

- ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో ఎస్డీఆర్ఎఫ్ యంత్రాలు, పరికరాల ప్రదర్శన
- కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ




**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, జూలై-09 :** విపత్తుల సమయంలో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్దాపూర్ లోని 17 వ బెటాలియన్ లో స్టేట్ డిసాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్ డీ ఆర్ ఎఫ్) ఆద్వర్యంలో విపత్తులు, వరదలు వచ్చే సమయంలో ఉపయోగించే యంత్రాలు, పరికరాల ప్రదర్శన గురువారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే -2లో

## కళాకారులను ప్రోత్సహిస్తాం




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 9 :** నూతన కళాకారులను ప్రోత్సహించడమే తమ ప్రధమ ధ్యేయమని కమాన్ పూర్ మండలం రొంపి కుంట గ్రామానికి చెందిన ప్రముఖ డ్యాన్స్ మాస్టర్ పులిపాక దేవా అన్నారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ ... బిట్ బిట్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నూతన కళాకారులను ప్రోత్సహించేందుకు నూతన కళాకారులను ఆహ్వానించడం జరుగుతుందని అన్నారు. బిట్.. బిట్... ఆర్ట్ క్రియేషన్ షార్ట్ ఫిలిమ్స్ ఫోక్ సాంగ్స్ ద్వారా యూట్యూబ్ ఛానల్ ద్వారా నూతన నటీనట్లకు గాయకులకు అవకాశం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పారిశ్రామిక ప్రాంతమైన గోదావరిఖని తోపాటు మంథని, సెంటినరీ కాలనీ, ఎనిమిదవ కాలనీ, కమాన్ పూర్, బసంత్ నగర్, తదితర ప్రాంతాలలోని యువతి యువకులు 9177709591 నంబర్కు సంప్రదించాలని కోరారు. ఈ సదవకాశాన్ని యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టీ హబ్ పరిశీలించిన డి ఎం హెచ్ ఓ

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి) జూలై 9 :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వై. పవిత్ర గురువారం ఆకస్మిక పెద్దపల్లి లోని టీ హబ్ సందర్శించి తగిన సూచనలు చేయడం జరిగినది. ఈ సందర్భంగా టీ హబ్ కేంద్రంలోని అన్ని ల్యాబ్ గదులను పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలు, పరికరాల వినియోగం, పరిశుభ్రత, నిర్వహణ విధానాలను సమీక్షించారు. ల్యాబ్‌లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి, వారి పనితీరు, సేవల నాణ్యత, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. అలాగే ల్యాబ్‌లలో పరిశుభ్రతను పాటిస్తూ, పరికరాలను సక్రమంగా నిర్వహించాలని, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని ఆదేశించారు. రోగులకు సకాలంలో ఖచ్చితమైన పరీక్షా ఫలితాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ భవనం ఆక్రమణ తొలగించాలి

**మొదటి పేజీ తరువాయి...** అధికారులతో మాట్లాడి ఆక్రమణ తొలగించాలని ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. డీపీఓ శిక్షణలో ఉండటంతో ఎంపీడీఓను పంపించారని, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడం అధికారుల బాధ్యత అని, శాంతియుతంగా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారంలో జాప్యం జరిగితే గ్రామస్థుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇటీవల గ్రామంలో జరిగిన నిరసన సందర్భంగా పోలీసులు లాఠీచార్జ్ చేసి గ్రామస్థులను భయాందోళనకు గురిచేశారని ఆరోపించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే చట్టాన్ని అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలవడం తప్ప, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరుతున్న వారిపై చర్యలు తీసుకోవడం కాదని అన్నారు. అలాగే గోడ కూల్చివేత ఘటనలో స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్‌ను చట్ట ప్రకారం కోర్టుకు అప్పగించకుండా పోలీస్ స్టేషన్‌లో ఉంచడం సరికాదని పేర్కొన్నారు. రైతుల జీవనాధారమైన ట్రాక్టర్‌ను యజమానికి లేదా కోర్టు ఆదేశాల మేరకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అధికారులు చట్టబద్ధంగా, పారదర్శకంగా వ్యవహరించి నరసింహులపల్లె అంగన్‌వాడీ భవనం సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని జీవన్‌రెడ్డి అధికారులకు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

## ఫలితాల మెరుగుదలకు...

**మొదటి పేజీ తరువాయి...** నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. 100 శాతం లక్ష్యాలను సాధించిన పాఠశాలలను స్వయంగా సందరి నంచి, ఆయా పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. విద్యార్థుల్లో కనీస అభ్యాస సామర్థ్యాల పెంపునకు ప్రతి ఉపాధ్యాయుడు బాధ్యతతో పనిచేయాలని, నాణ్యమైన బోధన ద్వారా జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి కె.రాము, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్పీలు అభయ్ రాజ్, విజయ్, జయంత్, ప్రవీణ్, మహేష్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విపత్తుల సమయంలో ఎస్డీఆర్ఎఫ్ కీలకం








**మొదటి పేజీ తరువాయి...** ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాధితులను గుర్తించే కెమెరా, రిమోట్ కంట్రోల్ లైఫ్ బోయ్ (ప్రాణరక్షక తేలియాడే పరికరం), తనిఖీ రంధ్రం చేసే పరికరం, ఎత్తైన వెలుతురు స్తంభం (లైట్ మాస్ట్), రక్షణ కార్యక్రమాల కోసం ఉపయోగించే రోటరీ కట్టింగ్ యంత్రం, గాలి ద్వారా బరువులను ఎత్తే లిఫ్టింగ్ బ్యాగ్, పీవీసీ రక్షణ దుస్తులు, హైడ్రాలిక్ స్ప్రెడర్ కట్టర్ (లోహాన్ని విప్పే, కత్తిరించే పరికరం) ప్రదర్శన లో పెట్టగా, జిల్లా కలెక్టర్, ఎస్పీ, అధికారులతో కలిసి పరిశీలించారు. ఒక్కో యంత్రం పనితీరు, వాటిని ఉపయోగించే విధానాన్ని వివరించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు కామారెడ్డి, వరంగల్ ఇతర ప్రాంతాల్లో ఎస్ డీ ఆర్ ఎఫ్ టీమ్ అందించిన సేవల వీడియోలను ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు రిజర్వాయర్లు ఎగువ మానేరు, మధ్య మానేరు, అన్నపూర్ణ, మల్కపేట ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంతో పాటు సెప్టెంబర్, అక్టోబర్ నెలలో భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ డీ ఆర్ ఎఫ్ బృందం శిక్షణ లో నేర్చుకున్న అంశాలు విపత్తులు సంభవించినప్పుడు తక్షణమే వినియోగించాల్సి వస్తుందని తెలిపారు. అప్పుడు ప్రతి నిమిషం విలువైందని స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీస్, ఫైర్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు ఒక టీమ్ గా సమాచారం చేరవేస్తూ.. వరదలు వచ్చినప్పుడు సమన్వయంతో సేవలు అందించాలని ఆదేశించారు. గత ఏడాది వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల్లో ఉత్తమ సేవలు అందించిన ఎస్డీఆర్ఎఫ్ బృందం, ఇతర అధికారులను అభినందించారు. ఎప్పుడైనా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. వర్షాలు వస్తే సేవలు అందించేందుకు ఎప్పుడైనా సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాది వరదలు సంభవించి ఇబ్బంది పడిన చోట్ల అధికారులు పరిశీలించి.. ఇంకా కావలసిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. విపత్తులు సంభవించినప్పుడు వాడే పరికరాలు, యంత్రాలతో మాక్ డ్రిల్ నిర్వహించాలని ఆదేశించారు. ఇంకా ఏమైనా యంత్రాలు, పరికరాలు కావాల్సి ఉంటే ముందస్తుగా తెప్పించాలని సూచించారు. ఉత్తమ సేవలు అందిస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కమాండెంట్ పీ జె.పి.సి. ఛటర్జీ, అడిషనల్ కమాండెంట్ ఎంఐ సురేష్, అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, ఎస్డీఆర్ఎఫ్ ఆర్ఐ బండి శ్రీనివాస్, తహసీల్దార్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

**మొదటి పేజీ తరువాయి...** పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ,, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, మంజూరైన నిధులతో పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామ వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి, పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని, ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్ కార్డు కలిగిన ప్రతి గ్రామీణ పేద కుటుంబానికి 125 రోజుల పని దినాలు కల్పించాలని, తద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, మహిళా సంఘాల కార్యకలాపాలకు ఉపయోగపడే వీఓ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, ?ప్రతి గ్రామ పంచాయతీ రాబోయే మూడు సంవత్సరాల కాలానికి సమగ్ర అభివృద్ధి ప్రణాళిక ను రూపొందించుకోవాలని, ఇది కేవలం పత్రాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు జరిగేలా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఇందిరమ్మ కమిటీ ప్రతిపాదించిన గృహాల అర్హుల జాబితాను గెజిటెడ్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ప్రక్రియలో మండల అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు) సమన్వయ బాధ్యతలు చేపట్టి, తమ పరిధిలోని గెజిటెడ్ అధికారులకు గృహాల ధృవీకరణ బాధ్యతలను కేటాయించాలని ,ధృవీకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సీఈఓ నరేందర్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మానసిక వికలాంగురాలిపై అత్యాచారం కేసులో కఠిన తీర్పు

**-నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5000 జరిమానా**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 9 :** గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మానసిక వికలాంగురాలిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి జగిత్యాల జిల్లా న్యాయస్థానం గురువారం కఠిన శిక్ష విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2024 జూన్ లో ఒరుగంటి శ్రీనివాస్ వ్యక్తి గొల్లపల్లి మండలానికి చెందిన మానసిక వికలాంగురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేయగా, సిఐ రామ్ నరసింహ రెడ్డి విచారణ చేపట్టి న్యాయస్థానానికి బలమైన సాక్ష్యాలు సమర్పించారు. కేసును విచారించిన మొదటి అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి సునీత రవీంద్ర రెడ్డి గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడికి 10 సంవత్సరాల కఠిన జైలు శిక్ష, 5000 రూపాయల జరిమానా విధించారు. అదే సమయంలో బాధిత మహిళకు 1,50,000 రూపాయల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

**మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత.**

**జిల్లా ఎస్పీ అశోక్ కుమార్..**

జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మహిళల భద్రతకు పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, మహిళలు, యువతులు తమపై జరిగే వేధింపులు, అన్యాయాల గురించి నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. నేరం చేసినవారు ఎవరైనా శిక్ష నుండి తప్పించుకోలేరన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పిపి బిట్ల నర్సయ్య, సిఐ రామ్ నరసింహ రెడ్డి, ఎస్ఐలు సతీష్, శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్, కానిస్టేబుల్ రాజులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.



# అత్తను ఇంట్లోంచి గెంటేసిన కర్కష కోడలు

**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 9 :** జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బక్క శెట్టి బక్కవ్వ ( 82)అనే వృద్ధురాలిని తన కోడలు లక్ష్మి,, మనుమడు గణేష్ లు కాలు విరగ్గొట్టి ఇంట్లోంచి గెంటి వేశారని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను గురువారం ఆశ్రయించింది.ఈ మేరకు ఆ వృద్ధ తల్లి సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ సాయం తో ఆర్డీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి కోట వసంత కు ఫిర్యాదు చేయగా తల్లి దండ్రుల రక్షణ పోషణ చట్టం కింద అ కోడలు, మనుమనిపై పై కేసు నమోదు చేశారు. అనంతరం అ వృద్ధ తల్లి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో విలేకరులకు తన గోడు వినిపిస్తూ రోదించారు . తన ఏకయిక కొడుకు గంగ రాజం మరణించాడని, నా ఆస్తులు అనుభవిస్తున్న నా కోడలు నన్ను పోషించక పోగా స్వయంగా నిర్మించుకున్న ఇంట్లోంచి ఆమె, ఆమె చిన్న కొడుకు కలిసి బలవంతం గా కాలు విరిగేలా కొట్టి వెళ్ల గొట్టారని , నా కోడలు, మనుమని పై కేసు పెట్టి,నా ఇంటి లో నన్ను ఉంచేలా, నా పోషణ, వైద్య ఖర్చులు పెట్టేలా తగు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను, పోలీస్ అధికారులను ఏడుస్తు వేడుకున్నారు.వృద్ధురాలి వెంట సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు సీనియర్ న్యాయవాది హరి అశోక్ కుమార్, వృద్ధుల సంరక్షణ కాన్సిలియేషన్ అధికారి పి. సి. హన్మంత్ రెడ్డి, సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## మక్కాలో ఉమ్రా యాత్ర విజయవంతంగా పూర్తి చేసిన

# టీఎన్‌జీవో సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి

**చురకలు ప్రతినిధి హైదరాబాద్, జూలై 09 :** తెలంగాణ నాన్-గెజిటెడ్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎస్. ఎం. ముజీబ్ హుస్సేనీ (ముజీబ్) తన కుటుంబ సభ్యులతో కలిసి పవిత్ర పుణ్యక్షేత్రమైన మక్కాలో ఉమ్రా తీర్థయాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా పవిత్ర కాబా గృహం వద్ద అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన ఆయన అల్లాహ్ కృపతో తెలంగాణ రాష్ట్రం, భారత దేశం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, దేశ రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో ఐశ్వర్యంతో జీవించాలని ప్రార్థించారు.అలాగే తెలంగాణ,దేశ ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం తాను మరింత సమర్థవంతంగా పనిచేసేలా శక్తిని, ధైర్యాన్ని ప్రసాదించాలని అల్లాహ్‌ను వేడుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణ కోసం యూనియన్ వేదికగా నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందితేనే నిజమైన ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని పేర్కొన్న డాక్టర్ ముజీబ్ హుస్సేనీ, ప్రపంచవ్యాప్తంగా భారత దేశ ప్రజలు, తెలుగు ప్రజలు మరింత కీర్తి ప్రతిష్టలు సాధించాలని, తెలుగు రాష్ట్రాల్లో సోదరభావం, ఐకమత్యం, దేశ లో సామరస్యం నెలకొనాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.ఉమ్రా యాత్ర అనేది ఒక గొప్ప ఆధ్యాత్మిక అనుభూతి అని పవిత్ర మక్కా నేలపై చేసిన ప్రార్థనలు జీవితానికి కొత్త ఉత్సాహాన్ని, సేవా స్ఫూర్తిని అందించాయని ఆయన అన్నారు. ఈ యాత్ర తన జీవితంలో చిరస్మరణీయమైన అనుభవంగా నిలిచిపోతుందని, భవిష్యత్తులో కూడా మరింత అంకితభావంతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ రాష్ట్రాభివృద్ధికి, దేశ అభివృద్ధికి ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు.తన ఉమ్రా యాత్ర విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ, శుభాకాంక్షలు తెలిపిన శ్రేయోభిలాషులు, స్నేహితులు, అభిమానులకు డాక్టర్ ఎస్. ఎం. ముజీబ్ హుస్సేనీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (09) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని యామాపూర్,బర్దిపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు గురువారం ఫ్రెండ్ చారిటబుల్ ట్రస్టు అధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు ఇతర విద్యా సామగ్రిని మొత్తం 56 విద్యార్థులకు పంపిణీ చేశారు.ప్రతి పేద విద్యార్థికి విద్య భారం కాకూడదు అనే లక్ష్యంతో 2014లో స్థాపించబడిన ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ గత 12 ఏళ్లుగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం సేవలందిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు సంఘం అమృత,కనుక నాగేష్, ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి గుడురు శ్రీకాంత్ ట్రస్టు సభ్యులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గంగపుత్రులకు జీవనోపాధి కోల్పోయినట్టే



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (09) :** సదరమాటు బ్యారేజీ వద్ద సైడ్ వాల్ నిర్మాణం తో గంగపుత్రులకు జీవనోపాధి కోల్పోయినట్టే నని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలం ఫకిర్ కోండాపూర్ గ్రామ గంగ పుత్ర సంఘ నాయకులు అన్నారు. గురువారం మాట్లాడుతూ గోదావరి నది ని నమ్ముకోనీ వందల కుంటుబ లు అదరపడ్డయని గుండమ్మడుగు రేవు లో చేపలు పట్టి విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నమనీ మత్స్యకారులు ఇప్పటికే రేవులో నీళ్లు లేక ఎండిపోయింది భవిష్యత్తులో సైడ్ వాల్ నిర్మించడం వల్ల నీళ్లు రాక మా ఉపాధి ప్రశ్నార్థంగా మారుతుందని గంగపుత్ర సంఘ నాయకులు అవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు మరియు ప్రజాప్రతినిధులు తక్షణమే సైడ్ వాల్ నిర్మించకుండా ఆపాలని కోరుతున్నాం ఇట్లు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు ఎల్లా శ్రీనివాస్ దుబాక సాయికుమార్,తోకల తిరుపతి తదితరులు పెర్కొన్నారు.

## డబ్బు విషయంలో గొడవ...

## ఇనుప రాడ్‌తో దాడి

**చురకలు విలేకరి, మల్యాల, జూలై 9 :** బీసీ కాలనీలో డబ్బు విషయంలో జరిగిన గొడవలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మల్యాల ఎస్ఐ సందీప్ తెలిపిన వివరాల ప్రకారం మల్యాల మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన సఖినా బేగం బీడిలు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, బుధవారం రాత్రి సఖినా బేగం బంధువైన రిజ్వాన్‌కు, అదే కాలనీలోని మరో వ్యక్తికి డబ్బు విషయంలో గొడవ జరిగిందని తెలిపారు. ఈ గొడవను సర్దిచెప్పేందుకు వెళ్లిన పాషా ఖాన్‌పై ఆవేశంలో ఉన్న ఆ వ్యక్తి అక్కడే ఉన్న ఇనుప రాడ్‌తో తలపై బలంగా కొట్టాడని, తీవ్ర రక్త గాయాలతో పాషా ఖాన్ అక్కడే కుప్పకూలగా, వెంటనే రిజ్వాన్ 108 అంబులెన్స్‌లో పాషా ఖాన్‌ను జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించచి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై బాధితుడి భార్య సఖినా బేగం మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా దాడి చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మల్యాల ఎస్ఐ సందీప్ తెలిపారు.

# అంగన్వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి

**-గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలి**

**-జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత**




**చురకలు విలేకరి, రాయికల్, జూలై 9 :** అంగన్వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలని,గ్రామ సభల ద్వారా రీ-సర్వే పనులు వేగవంతం చేయాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్.లత అన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఉప్పుమడుగు గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే, అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్.లత గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ప్రారంభించిన భూసర్వే-రీసర్వే సందర్భంగా రాయికల్ మండలంలోని ఉప్పుమడుగు గ్రామంలో భూముల రీ-సర్వేకు సంభందించిన అవగాహన సదస్సు నిర్వహించారు. భూమి రీ-సర్వే చేయుట లో చట్టం పరిధిలో ఉన్నా సర్వే కార్యాక్రమాల గురించి, సర్వే చేయు పని విదానాల గురించి ఈ గ్రామ సభలో గ్రామ రైతులకు మరియు గ్రామ ప్రజలకు అవగాహణ కల్పించారు. అనంతరం ఉప్పుమడుగు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లల హాజరు, పోషకాహారం పంపిణీ, పరిశుభ్రతపై క్షుణ్ణంగా పరిశీకించారు. పిల్లల హాజరు శాతం పెంచి నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, భూమి కొలతల ఏ.డికిషన్ ప్రసాద్, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత సిబ్బంది, బీఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల - కూకట్‌పల్లి మధ్య సూపర్ లగ్జరీ బస్సుల సేవలు ప్రారంభం

**-రోజుకు రెండు సర్వీసులు అందుబాటులోకి**



**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 9 :** ప్రయాణికుల సౌకర్యార్థం జగిత్యాల నుంచి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వరకు సూపర్ లగ్జరీ బస్సు సర్వీసులను ఆర్టీసీ ప్రారంభించింది. డిపో మేనేజర్ చేతుల మీదుగా గురువారం ఈ కొత్త సర్వీసులను ప్రారంభించారు. కొత్త షెడ్యూల్ ప్రకారం జగిత్యాల నుంచి ఉదయం 3:00 గంటలకు, మధ్యాహ్నం 3:00 గంటలకు సూపర్ లగ్జరీ బస్సులు బయలుదేరనున్నాయి. అలాగే కూకట్‌పల్లి నుంచి ఉదయం 9:00 గంటలకు, రాత్రి 9:30 గంటలకు జగిత్యాలకు బస్సు సర్వీసులు నడవనున్నాయి. ఈ కొత్త సర్వీసులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో డిపో మేనేజర్, సీఐ, ఎస్‌టీఐతో పాటు ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు

**-మెట్‌పల్లి జాతీయ రహదారిపై రవాణా శాఖ తనిఖీలు**



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, జూలై 9 :** జాతీయ రహదారిపై రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో గురువారం విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు,ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు ఓవర్‌లోడింగ్, అతివేగాన్ని అధికారులు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. ప్రజల భద్రతే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టామని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని హెచ్చరించారు. భవిష్యత్తులోనూ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గిరీష్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

### వేములవాడ అనుపురం వద్ద

## ఘోర రోడ్డు ప్రమాదం

**-ముగ్గురు వలస కూలీలు దుర్మరణం**

**-పలువురికి గాయాలు**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల జులై 09 :** రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ పరిధిలోని అనుపురంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.ప్రమాదంలో ముగ్గురు బీహార్ కు చెందిన వలస కూలీల దుర్మరణం చెందారూ.పలువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రానికి చెందిన కొందరు కూలీలు పనుల నిమిత్తం వాహనంలో వెళ్తుండగాఅనుపురం వద్ద కు చేరుకొనే సరికి ప్రమాదం జరిగింది.ప్రమాద తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో ఘటనా స్థలంలోనే కూలీలు ప్రాణాలు కోల్పోయారు.క్షతగాత్రుల ఆర్తనాదాలతో సంఘటనా స్థలం విషాదంగా మారింది.రహదారి రక్త సిక్తంగా మారింది.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న వేములవాడ పోలీసులు, స్థానికుల సహాయంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.





## మైనార్టీ గురుకులంలో ఖాళీ సీట్లకు ధరఖాస్తుల ఆహ్వానం

**చురకలు విలేకరి, ధర్మపురి, జూలై 9 :** ధర్మపురి పట్టణంలోని తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 2026 - 2027 విద్యా సంవత్సరానికి 5,6, 7 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్. సాహిత్య ఒక ప్రకటన లో తెలిపారు. ఈ విద్య సంవత్సరంలో 5 వ తరగతిలో ఓసి కేటగిరిలో 01 , ఎస్టి కేటగిరీలో 01 సీటు,6 వ తరగతిలో మైనారిటి కేటగిరిలో 9 సీట్లు, 7 వ తరగతిలో మైనారిటి కేటగిరిలో 04 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన విద్యార్థినుల తల్లితండ్రులు ఈ అవకాశాన్ని 11-07-2026 లోపు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇతర వివరాల కోసం ధర్మపురి లోని మైనారిటి పాఠశాల 7995057966 నెంబర్ కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

## నడికుడ గ్రామ సరిహద్దు ఏర్పాటుకు తహసీల్దార్‌కు వినతి



**చురకలు విలేకరి, మల్లాపూర్, జూలై 9 :** నడికుడ గ్రామ సరిహోద్దులు ఏర్పాటుకై తహసీల్దార్ రాంచందర్ కు నడికూడా సర్పంచ్ తూర్పు సమత, రాజేష్, తో పాటు గ్రామస్తులు వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సరిహోద్దులైన మల్లన్న గుట్ట, ఎల్లమ్మ గుట్ట, గుడ్డెనుగుల గుట్ట ప్రాంతాల సరిహోద్దులను సర్వేయర్ తో సర్వే చేయించి హోద్దులను కేటాయించాలని, గ్రామ సరిహోద్దులో ఇతరులు వ్యవసాయ పనులు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వారిచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉప సర్పంచ్ ఎస్, మారుతి, మాజీ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, గ్రామస్తులు ముద్దం రాజశేఖర్ రెడ్డి, భూక్య పద్మ, ఎద్మ లావణ్య, రాజేశ్వర్, చంద్రకళ, లక్ష్మి, చిన్న రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అమర్నాథ్‌లో మాజీ సర్పంచ్ ప్రత్యేక పూజలు

**-మళ్ళీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని అమర్నాథ్‌లో మొక్కలు చెల్లింపు**

**-12,756 అడుగుల ఎత్తున ఉన్న మంచు లింగాన్ని కాలి నడకన దర్శించుకున్న మాజీ సర్పంచ్**




**చురకలు విలేకరి, ఎండపల్లి, జూలై 9 :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు మళ్ళీ సీఎం కావాలని జగిత్యాల జిల్లా ఎండపల్లి మాజీ సర్పంచ్ మారం జలేందర్ రెడ్డి జమ్మూ కాశ్మీర్ లో జరుగుతున్న అమర్నాథ్ యాత్రకు వెళ్లి దాదాపు 14కిలో 1 మీటర్ల సముద్ర మట్టం నుండి 12,756 అడుగుల ఎత్తులో ఉన్న అత్యంత కఠినమైన శ్రీ అమృనాథ్ మంచు లింగాన్ని కాలి నడక మార్గంలో దర్శించు కుని ప్రత్యక పూజలు చేశారు. ఈ సందర్భంగా జలేందర్ రెడ్డి మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు, మరో సారి ముఖ్యమంత్రి గా సేవలందించాలని, ధర్మపురి నియోజకవర్గానికి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యే గా సేవ చేసే అవకాశం లభించాలని అమర్నాథ్ సన్నిధానంలో ప్రార్థించినట్లు పేర్కొన్నారు. అమర్నాథ్ యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకున్న అనంతరం, రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు సుఖ సంతోషాలు కలగాలని భగవంతుడిని ప్రార్థించినట్లు మారం జలేందర్ రెడ్డి తెలిపారు.

# ప్రభుత్వ భూమి అక్రమ పట్టాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

**-సామాజిక కార్యకర్త బొల్లంపల్లి సంతోష్ కుమార్ ఆర్ డీ ఓ కు ఫిర్యాదు**



**చురకలు ప్రతినిధి మంథని,జూలై 9 :** ప్రభుత్వ భూమిని అక్రమంగా తన పేరిట పట్టా చేయించు కుని బ్యాంకు రుణం పొందిన అల్లం కోమలత పై తక్షణచర్యలు తీసుకోవాల ని సామాజిక కార్యకర్త బొల్లంపల్లి సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శు క్రవారం మంథని ఆర్‌డీఓకు ఫిర్యాదు చేసిన ఆయన, అల్లం కోమలత ప్రభుత్వ స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. అదే భూమిని చూపించి బ్యాంకు నుండి రుణం కూడా తీసుకున్నారని తెలిపారు. రుణమాఫీ కూడా జరిగిందని రైతుబంధు పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారని ఆయన ఆరోపించారు. ముత్తారం మండలం ఖమ్మం పల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 618 / 41/1 లో 3ఎకరాల 19గుంటల అసైన్డ్ భూమి అక్రమంగా పట్టా చేయించు కున్నారని ఆయన వాపోయారు. ప్రభుత్వ భూమి పేదలకు, ప్రజా అవసరాలకు ఉపయోగపడాలి. కానీ కొందరు అక్రమ మార్గాల్లో పట్టాలు చేయించుకుని స్వలాభం కోసం వాడుకుంటున్నారు. ఇది చట్ట ఉల్లంఘనే కాదు, ప్రభుత్వానికి కూడా నష్టం" అని సంతోష్ కుమార్ అన్నారు. ఈ అంశంపై రెవెన్యూ, బ్యాంకింగ్ శాఖల అధికారులు వెంటనే విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అక్రమంగా మంజూరైన పట్టాను రద్దు చేసి, ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదుపై సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

**-రాష్ట్ర జాయింట్ కన్వీనర్ బద్రి దేవేందర్ పటేల్**




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 9 :** సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే యాజమాన్యం పరిష్కరించాలని బిజెపి తెలంగాణ కార్మిక సెల్ రాష్ట్ర జాయింట్ కన్వీనర్ బద్రి దేవేందర్ పటేల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ రెండు లో గత 11 రోజులుగా సింగరేణి అధికారులు చేస్తున్న సమ్మెకు దేవేందర్ పటేల్ సంఘీభావం తెలిపారు. ఇందులో వి తిరుపతి, ఎం శ్రీనివాస్, కే లక్ష్మణరావు, పి రామ్ కిషోర్, పి సాయి కృష్ణ, జి ప్రదీప్ లు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. సందర్భంగా దేవేందర్ పటేల్ మాట్లాడుతూ సింగరేణి అధికారులు సమ్మె చేస్తున్న యాజమాన్యం ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని వారి సమస్యలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రతి కార్మికునికి అండగా ఉండడమే తమ ధ్యేయమని అన్నారు. కార్మికులపై యజమాన్యాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేపూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ గోదావరిఖని ఉచిత కంటి పరీక్షలు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 9 :** రేకుర్తి కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఎన్టిపిసి సాయి సేవా సమితిలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం విజయవంతమైంది.ఈ కంటి ఆపరేషన్ శిబిరానికి సుమారు 109 మంది హాజరవగా, రేకుర్తి ఆసుపత్రి టెక్నిషియన్ ప్రభాకర్ వైద్య పరీక్షలు నిర్వహించగా 46 మందిని ఆపరేషన్ నిమిత్తం బస్సులో రేకుర్తికి తరలించడం జరిగింది. వీరికి ఈరోజు వైద్య పరీక్షలు జరిపి రేపు ఆపరేషన్ చేసాక ఎల్లుండి తీసుకురావడం జరుగుతుందని క్లబ్ ప్రెసిడెంట్ లయన్ కోదాటి ప్రవీణ్, సెక్రటరీ లయన్ ఎతిరాజు సురేష్, ట్రెజరర్ లయన్ రెడ్డి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లియో టు లయన్ డిస్టిక్ కో ఆర్డినేటర్ నార్ల ప్రసాద్, విశిష్ట అతిథులుగా జెడ్ సి లయన్ కొమురవెల్లి సుధాకర్, డిసి ఐ స్క్రీనింగ్ క్యాంపు లయన్ మామిడిపల్లి శ్రీధర్, డిసి రిజల్టు స్టూడెంట్ లయన్ గోపాల్ రావు, జిఎస్టి సపోర్టింగ్ లయన్ గుంత వినొద్, లయన్స్ షేగంటి నరేష్ రమణా రావు, రంగారావు,అశోక్ రావు, చింతల సతీష్, మహేందర్ రెడ్డి, కొమురవెల్లి రాహుల్, అనిల్ రావు, సాయి సేవా సమితి నిర్వాహకులు ఆశోక్ రెడ్డి, వేణు, నర్సయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమర్‌నాథ్ యాత్రలో పాల్గొని

# ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ సర్పంచ్





**చురకలు విలేకరి, ఎండపల్లి, జూలై 9 :** ఎండపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మారం జలంధర్ రెడ్డి జమ్మూ-- కాశ్మీర్‌లో జరుగుతున్న పవిత్ర శ్రీ అమర్‌నాథ్ జీ యాత్రలో పాల్గొని, బాల్తాల్ బేస్ క్యాంపు నుంచి సుమారు 14 కిలోమీటర్ల కఠినమైన కాలినడక మార్గంలో ప్రయాణించి, సముద్ర మట్టానికి 12,756 అడుగుల ఎత్తులో ఉన్న పవిత్ర శ్రీ అమర్‌నాథ్ జీ మంచు లింగాన్ని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజల సుఖశాంతి, అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) మరోసారి తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలందించాలని, ధర్మపురి నియోజకవర్గానికి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని స్వామివారి సన్నిధిలో ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

# గీట్ల జనార్దన్ రెడ్డి జయంతి వేడుకలు విజయవంతం చేయాలి



**చురకలు ప్రతినిధి,మంథని, జూలై 9 :** దివంగనేత, ప్రముఖ రాజకీయా నాయకులు గీట్ల జనార్దన్ రెడ్డి 88వ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మంథని విద్యార్థి యువత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారుగా 50 ఏళు ్లగా సామాజిక సేవారంగంలో విభిన్న సేవలు చేసినటువంటి గీట్ల జనార్దన్ రెడ్డి కృషి ఎనలేనిదని ఆయన గుర్తు చేశారు.శుక్రవారం ఆయన జయంతి వేడుకలలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మారుతి కోరారు.

# లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేత



**చురకలు విలేఖరి వీణవంక జూలై 09 :** హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ ఆదేశాల మేరకు మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గంగాడి రాజిరెడ్డి, గ్రామ సర్పంచ్ జడల రమేష్,మండల యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ పోతరవేన సతీష్ కుమార్, ఇందిరమ్మ కమిటీ మెంబర్లు సింగిరెడ్డి రమ సమ్మిరెడ్డి, కండె మహేందర్ గ్రామ కార్యదర్శి ఓర్సు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దేవత పోచమ్మకు మొక్కులు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 9 :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం అకెన పల్లి గ్రామంలో సర్పంచ్ గాదె స్రవంతి -సుధాకర్ ఆధ్వర్యంలో కాపు వాడలోని గ్రామ పోచమ్మ, బొడ్రాయిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి బోనాలు సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గాదె స్రవంతి-సుధాకర్ మాట్లాడుతూ ప్రత్యేక ఆనవాయితీగా కొలిచేటువంటి గ్రామ దేవత పోచమ్మ ను కొలిచి కొబ్బరికాయలు కొట్టి, బోనాలు సమర్పించి, పాడి పంటలు బాగా పండాలని, ఆవులు, కుటుంబ సభ్యులు చల్లగా ఉండాలని మొక్కులు చెల్లించుకోవడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా బోనాలు ఎత్తుకొని చెట్లు తీర్థాలకు వెళ్లడం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలందరూ సాంప్రదాయాలను పాటిస్తూ మొక్కులు చెల్లించుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని సర్పంచ్ గాదె స్రవంతి -సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాదె స్రవంతి- సుధాకర్, గ్రామ ప్రజలు, పెద్దలు, మహిళలు, యువకులు,అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలను

# శాస్త్రీయంగా రూపొందించాలి

**-గ్రామాల్లో శాశ్వత ప్రభుత్వ ఆస్తులు నిర్మించాలి**

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 9 :** వి.బి.జి.రామ్ జీ పథకాన్ని సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్లో సారంగాపూర్, బీర్ పూర్, రాయికల్, జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, ధర్మపురి, బుగ్గారం, ఎండ పెల్లి, వెల్గటూర్, గొల్లపెల్లి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్, ఎం.పి.డి.ఓ. చిరంజీవి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, వి.బి.జి.రామ్ జీ పథకం, నరేగా పథకంలో వచ్చిన మార్పులను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ 2005లో గ్రామీణ ప్రాంతాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టిందని, గత 21 సంవత్సరాలుగా ఈ పథకం విజయవంతంగా అమలై గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం గణనీయంగా తగ్గిందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు, విద్యా స్థాయి కూడా ఎంతో మెరుగుపడ్డాయని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుని, చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, మంజూరైన నిధులతో పూర్తయిన పనులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రామంలోని వనరులను వినియోగించుకుని ఆదాయాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ తమ పరిధిలో ఉన్న సహజ వనరులు, స్థానిక ఆదాయ మార్గాలను గుర్తించి, పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఆర్థికంగా బలోపేతం అయితేనే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామాల్లో పారిశు ద్ధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని, ఘన వ్యర్థాల నిర్వహణ ప్రతి ఇంటి నుంచి ప్రారంభం కావాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత ఆస్తుల సృష్టే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం వి.బి.జి. రామ్జీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉండగా, కొత్త పథకం ద్వారా గ్రామాలకు ఉపయోగపడే ఆస్తుల నిర్మాణంపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం జూలై 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. గతంలో నరేగా నిధుల్లో అధిక భాగం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే వినియోగించారని, కొత్త పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తే గ్రామాలను అద్భుతంగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. నరేగా పథకంలో ప్రభుత్వ పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణానికి అవకాశం లేకపోయినా, కొత్త వి.బి.జి.రామ్ జీ పథకంలో ఆ అవకాశం కల్పించారని తెలిపారు. జిల్లాలో అవసరమైన ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్లు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్లు, ప్రహరీ గోడల నిర్మాణాన్ని ఈ పథకం ద్వారా చేపట్టాలని సూచించారు. గ్రామీణ గ్రంథాలయాలు, అంగన్వాడీ భవనాలు, కమ్యూనిటీ హాళు,, సోలార్ వీధి దీపాలు, బస్ స్టాండ్లు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలు తదితర 318 రకాల అభివృద్ధి పనులను ఈ పథకం ద్వారా చేపట్టే అవకాశం ఉందన్నారు. కేవలం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికే పరిమితం కాకుండా గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మొత్తం నిధుల్లో కనీసం 50 శాతం నిధులను శాశ్వత ఆస్తుల సృష్టికే వినియోగించేలా గ్రామపంచాయతీలు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. రోడ్లు నిర్మించడం అవసరమే అయినప్పటికీ, గ్రామానికి తరతరాల పాటు ఉపయోగపడే ఆస్తులను సృష్టిస్తే ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని ప్రజాప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జెడ్పీ సిఈఓ గౌతం రెడ్డి, డిఆర్డిఓ రఘువరన్, డిపిఓ మధుసూదన్, మాస్టర్ ట్రైనర్, ఎం.పి.డి.ఓ. చిరంజీవి, సంబంధిత జిల్లా అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వాన వచ్చిందో బోలా.. బోలా..

**-కమాన్‌పూర్ కరెంటు ఆఫీస్ పరిస్థితి**





**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 9 :** అది 40 సంవత్సరాల క్రితం కట్టిన కార్యాలయం ఇరుకు గదిలో కార్యాలయం కార్యకలాపాలు..వర్షాకాలం వచ్చిందంటే కంప్యూటర్లు ఫైల్ లు తడవాల్సిందే..కమాన్‌పూర్ మండల కేంద్రంలో 1986లో నిర్మించిన సబ్ స్టేషన్ యొక్క చిన్న షెడ్డు అప్పటి ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీపాదరావు 9మే 1986లో ప్రారంభించారు.కమాన్‌పూర్ సబ్ స్టేషన్ లో ఒక కంట్రోల్ రూమ్,స్టోర్,ఏఈ కార్యాలయం ఉంది.ఆ చిన్నారి పాతపడ్డ కార్యాలయం ఇరుకుగా మారింది.మొత్తం 11వేలమంది విద్యుత్ వినియోగ దారులు కమాన్‌పూర్,గుండారం,రాజాపూర్,జూలపల్లి,ములకలపల్లి, పెంచగల పేట, రొంపి కుంట, నాగారం, లింగాల, పేర పల్లి గొల్లపల్లి గ్రామాల్లో ఉన్నారు. 40 సంవత్సరాలుగా పాతబడ్డ కార్యాలయం పై పైన సిమెంట్ రేకులు ఉండేవి అవి కోతులు పూర్తిగా ధ్యాసం చేశాయి. మళ్లీ గత్యంతరం లేక గత ఐదు సంవత్సరాల క్రితం రేకులు వేసిన రేకులు మాత్రం పైకి లేచి వర్షం పడ్డ సమయంలో పూర్తిగా తడిచి పోవడం జరుగుతోంది. అలాగే స్టోర్ రూమ్ కిందికి ఉండడంతో పాములు లోపలికి దూర్తున్నాయి. దీంతో సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు.

**వర్షం వచ్చిన సమయంలో ఇబ్బందిగా మారుతుంది**
**నాలా అశోక్..ఎన్‌పిడిసిఎల్ఏఈ**

కమాన్‌పూర్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ కార్యాలయం వర్షాకాల సమయంలో వర్షం కురిసిన వేళ కంప్యూటర్లు, ముఖ్యమైన ఫైళ్ళు తడిచిపోవడం జరుగుతుంది.గదులు సైతం విలువగా ఉండడంతో ఇబ్బంది కలుగుతోంది.

# అనుపురం రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి

**-బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ భరోసా**

**-జిల్లా ఎస్పీతో కలిసి వేములవాడ ఏరియా ఆసుపత్రిలో క్షతగాత్రులకు పరామర్శ**





**చురకలు ప్రతినిధి,సిరిసిల్ల జూలై 09 :** వేములవాడ అర్బన్ మండలం అనుపురంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బొలెరో వాహనం, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో గాయపడి వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న క్షతగాత్రులను జిల్లా ఎస్పీ మహేష్ బి,గీతేతో కలిసి పరామ ర్శించారు.బాధితులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాద సమయంలో బొలెరో వాహనంలో కూలీలు ఉన్నారని, ప్రమాదంలో మృతి చెందిన,తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్య చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు .బాధితులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని ఆది శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.





# ప్రభుత్వ పథకాల రుణాలను పెండింగ్‌లో ఉంచొద్దు

**-కలెక్టర్ కోయ శ్రీహర్ష**
**-వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, పీఎం స్వనిధి రుణాల పంపిణీని వేగవంతం చేయాలి**
**-అర్హులైన ప్రతి బ్యాంకు ఖాతాదారుడికి సామాజిక భద్రత బీమా పథకాల ప్రయోజనం అందాలి**
**-డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి) జూలై 09 :** ప్రభుత్వ ప్రాయోజిత పథకాలరుణ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా అర్హులైన వారికి వెంటనే రుణాలు మంజూరు చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేయాలని, తిరస్కరించాల్సి వస్తే సరైన కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీతో కలిసి నిర్వహించిన జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ బ్యాంకుల పనితీరు, ప్రభుత్వ పథకాల రుణాలు, వ్యవసాయ, ఎంఎస్ఎంఈ, పీఎం స్వనిధి రుణాల పంపిణీ, సామాజిక భద్రత పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,ప్రభుత్వ పథకాల కింద వచ్చే రుణ దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉంచరాదని సూచించారు.అర్హులైన లబ్ధిదారులకు వెంటనే రుణాలు మంజూరు చేసి యూనిట్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని,తిరస్కరించే దరఖాస్తులకు సరైన కారణాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.పశు సంవర్ధక శాఖకు సంబంధించిన రుణాల మంజూరుపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రుణాల మంజూరుకు అవసరమైన పత్రాల చెక్‌లిస్ట్‌ను సంబంధిత అధికారులు సిద్ధం చేసి దరఖాస్తుదారులకు ముందుగానే అందుబాటులో ఉంచాలని, అవసరమైన పత్రాలతోనే దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ పంట రుణాల లక్ష్యంలో ఇప్పటివరకు 77 శాతం మాత్రమే సాధించామని, 91,002 మంది రైతులకు రూ.1,488 కోట్ల పంట రుణాలు అందించినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ రంగంలో లక్ష్య సాధన 65.9 శాతం మాత్రమే ఉండటం సంతృప్తికరంగా లేదని పేర్కొంటూ,అన్ని బ్యాంకులు ఈ రంగంలో రుణాల పంపిణీని పెంచాలని ఆదేశించారు.జిల్లాలో రైతులకు రుణాల పంపిణీ మరింత పెరగాలని,ముఖ్యంగా ప్రైవేట్ బ్యాంకులు వ్యవసాయం, ఎంఎస్ఎంఈ రంగాలకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. బ్యాంకుల వారీగా రుణాల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు.పీఏసీఎస్ గోదాముల నిర్మాణానికి అవసరమైన రుణాలను అత్యవసరంగా మంజూరు చేయాలని, భూముల కేటాయింపు త్వరలో పూర్తవుతుందని,వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేలా బ్యాంకులు సహకరించాలని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీలు),మెప్మా రుణాల్లో ఎన్‌పీఏ ప్రస్తుతం 0.8శాతం మాత్రమే ఉందని, దీనిని 0.5శాతం కంటే తక్కువకు తీసుకురావడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందన్నారు. మొండి బకాయిలను వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు.పీఎం స్వనిధి పథకం కింద వీధి వ్యాపారులకు రుణాల పంపిణీని మరింత పెంచాలని కలెక్టర్ అన్నారు.మొదటి, రెండో విడత రుణాలను సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు మూడో విడత రుణాలు అందేలా బ్యాంకులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పిఎంఎస్‌బివై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజె బి వై) వంటి సామాజిక భద్రత పథకాలను మరింత విస్తృతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో అత్యధిక బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా అన్ని బ్యాంకులు తమ అర్హులైన ప్రతి ఖాతాదారుడికి ఈ బీమా పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక అక్షరాస్యతను ప్రజల్లో మరింత పెంపొందించేందుకు గ్రామస్థాయిలో విస్తృతంగా ఆర్థిక అక్షరాస్యత శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 53 శిబిరాలు, రామగుండం, పెద్దపల్లి, మంథని పట్టణ ప్రాంతాల్లో 342 శిబిరాలు నిర్వహించినట్లు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాలను మరింత విస్తరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్, నాబార్డ్ ఆర్బీఐ, ప్రతినిధులు, వివిధ బ్యాంకుల జిల్లా సమన్వయ అధికారులు, జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.



# భవిష్యత్తు ఈవీలదే



**-ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**
**-హుజరాబాద్‌లో ఈవీ షో రూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 9 :** రాబోయే కాలం ఎలక్ట్రిక్ వాహనాలదేనని, ఎలక్ట్రిక్ వాహనాలతో కాలుష్యం తగ్గడంతో పాటు ఇంధనం ఆదా అవుతుందని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక పట్టణంలో వేదాద్రి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల షో రూమ్‌లో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎలక్ట్రిక్ వాహనాలనుమరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే పలు రకాల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు కార్లు బస్సులు భారీ వాహనాలు కూడా అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో మరిన్ని పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. ఎలక్ట్రిక్ వాహనాలతో వినియోగ దారులకు డబ్బులు కూడా ఆదా అవుతాయని గుర్తు చేశారు. ఇప్పటికే చాలామంది ఇంధనం నుండి ఎలక్ట్రిక్ వాహనాలకు మారుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన యాజమాన్యాన్ని అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్ రెడ్డి, జమ్మికుంట మున్సిపల్ మాజీ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహించుకున్న వార్డు సభ్యుడు





**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 9 :** ఆ రహదారి గుండా ఎందరో పోతున్నారు.అయినా రోడ్డుపై పడ్డ తాటికమ్మను మాత్రం తొలగించడం లేదు అది కాస్త చూసిన వార్డు సభ్యుడు తన విధిగా రోడ్డుపై నుండి పక్కకు తొలగించాడు.వివరాలకు వెళ్తే కమాన్ పూర్ మండలం గుండారం గ్రామ 1వవార్డు సభ్యుడు బొడ్డు రవి తాను విధిలోభాగంగా ఆటో నడుపుతూ వెళ్తున్నాడు.అతనికి కమాన్‌పూర్ ప్రధాన రహదారిపై రోడ్డు కు అడ్డంగా ఎండిన తాటి కమ్మ కనిపించింది చూడగానే దిగి దాన్ని పక్కకు తొలగించాడు. తన విధిని నెరవేర్చిన బొడ్డు రవి లా ప్రతి ఒక్కరు చేయాలని పలువురు వ్యాఖ్యానించారు.

# ఓటర్ సమగ్ర నమోదు చేయించుకోవాలి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 9 :** కమాన్ పూర్ మండలంలోని ప్రతి ఒక్కరూ సమక్క హోటల్ సర్వే కార్యక్రమంలో పాల్గొని తమ ఫారాలను అందజేయాలి అని తహసిల్దార్ ముస్త్యాల వాసంతి పేర్కొన్నారు. గురువారం కమాన్ పూర్ మండలంలోని గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని ఏడవ వార్డులో వార్డు సభ్యుడు పిడుగు ఎల్ఐసి సదయ్య ఆధ్వర్యంలో సమగ్ర సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసిల్దార్ వాసంతి హాజరై మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఎస్ ఐ ఆర్ సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తోందని ప్రతి ఒక్కరూ తమ ఓటర్ ఫారాలను నింపి బిఎల్వోలకు అప్పగించాలని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు,తహసిల్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ సతీష్, ఉపసర్పంచ్ రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు కవిత ,వడ్లకొండ వసంత , వడ్లకొండశంకర్ దామెర దేవయ్య, అబ్దుల్ రఫీ, మోదం కొమురయ్య, పిడుగు శంకర్, నాగరాజు, బిఎల్వోలు పిల్లి విజయ లక్ష్మి, అవునూరి రజిత తదితరులు పాల్గొన్నారు.